# సాక్షి సంగారెడ్డి

సోమవారం । 5 । మే । 2025






**దాహం తీర్చే అంబలి**

సేవే పరమావధిగా అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

వివరాలు 8లో ▸



**భూ భారతిపై గ్రామ సభలు**

రైతులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చింది. వివరాలు 8లో ▸



**జొన్నల కొనుగోలు ఎప్పుడో?**

ఆరుగాలం కష్టపడి పంటను పండించిన రైతన్నలు ధాన్యం విక్రయించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### నేటి నుంచి పాలీసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నారాయణఖేడ్: పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఖేడ్ మండలం జూకల్ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. ఉన్నత విద్యతోపాటు స్వయం ఉపాధి అవకాశాలు, నైపుణ్యానికి సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణతోపాటు అవసరమైన మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు కళాశాలలో లేదా 95055 04211 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### నేడు సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న ఆనంద్

నారాయణఖేడ్: సీపీఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం ఖేడ్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ ఖేడ్ డివిజన్ కార్యదర్శి ఆనంద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సమావేశానికి ఎమ్మెల్సీ నేలకంటి సత్యం, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింహ, జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలొద్దీన్‌తో పాటు ముఖ్య నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. నాయకులు చిరంజీవి, దత్తురెడ్డి, అశోక్, సతీశ్, ప్రేమ్ కుమార్, సంగమేశ్వర్, నర్సింహులు పాల్గొన్నారు.

### పేదల పక్షాన పోరాటం చేయాలి

సీపీఎం జాతీయ కార్యదర్శి డి.రాజా



రాజాకు స్వాగతం పలుతున్న సీపీఎం నాయకులు

జహీరాబాద్ టౌన్: పేదల పక్షాన పోరాటాలు చేయాలని, ఇళ్లు లేని వారికి స్థలాలు ఇప్పించడానికి ఉద్యమాలు చేయాలని సీపీఎం జాతీయ కార్యదర్శి డి.రాజా పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి గుల్బర్గాకు ఆయన వెళ్తుండగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జలాలొద్దీన్, జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి నర్సింహులు తదితరులు హుగ్గెల్లి చౌరస్తాలో స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా రాజా కొంచెం సేపు పార్టీ శ్రేణులతో మాట్లాడారు. ఆయన వెంట మాజీ రాజ్యసభ్యుడు అజీజ్ పాషా ఉన్నారు.

### నాగిరెడ్డిపల్లి గ్రామాభివృద్ధికి కృషి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



దుర్గాభవానీ మాతను దర్శించుకుంటున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్,

జహీరాబాద్: నాగిరెడ్డిపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. ఆదివారం కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లిలో నిర్వహించిన దుర్గాభవానీ జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో రాష్ట్రం బాగుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, జహీరాబాద్, సంగారెడ్డి ఎమ్మెల్యేలు కె.మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం, పీఏసీఎస్ చైర్మన్ స్రవంతిరెడ్డి, ఆయా మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు నర్సింహులు, నారాయణ, వెంకటేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నీట్ పరీక్ష





తార కళాశాలలో నీట్ పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



కూతురి కాళ్ల పట్టీలు తీస్తున్న తండ్రి



రూమ్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు

- 98మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

నేషనల్ ఎలిజిబుల్ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జిల్లాలోని 7 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 3,222 మంది అభ్యర్థులు హాజరు కాగా 98 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పలు పరీక్షా కేంద్రాలను ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. పరీక్షను పురస్కరించుకొని పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేశారు.

సంగారెడ్డి జోన్

# కాంగ్రెస్ సమావేశం రచ్చ రచ్చ

**ఇందిరమ్మ కమిటీల్లో బీఆర్ఎస్ నేతల ఆధిపత్యమేంటని నిలదీత**

- పార్టీ పరిశీలకుడిని అడ్డుకున్న పటాన్‌చెరు కాంగ్రెస్ నాయకులు
- మంత్రి దామోదర ఎదుటే నిలదీసిన శ్రేణులు
- కాంగ్రెస్ జిల్లా ముఖ్య నేతల సమావేశం రసాభాస



సమావేశంలో వేదికపై ఉన్న నాయకులను నిలదీస్తున్న పటాన్‌చెరు నియోజకవర్గం కార్యకర్తలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు.. అంతర్గత పోరు మరోమారు రచ్చకెక్కింది. మంత్రి దామోదర రాజనర్సింహ, పార్టీ పరిశీలకులుగా జిల్లాకు వచ్చిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సమక్షంలోనే ఆ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గం నేతలు రచ్చ రచ్చ చేశారు. సమావేశం వేదిక వద్దకు దూసుకొచ్చి.. రామ్మోహన్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ముఖ్యనాయకులు సముదాయించినా నాయకులు పట్టించుకోలేదు. దీంతో సమావేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం ఆదివారం సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో ఆ పార్టీ జిల్లా ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల నుంచి ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతుండగా నాయకులు అడ్డుకున్నారు. ఇందిరమ్మ కమిటీల్లో గూడెం పెత్తనంపై ఆగ్రహం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రామ్మోహన్‌రెడ్డి వివరిస్తున్న క్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన ముఖ్యనేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పెత్తనం ఏంటని రామ్మోహన్‌ను ప్రశ్నించారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో కీలకమైన ఈ కమిటీలోఅసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరిగిందని వాగ్వాదానికి దిగారు. నియోజకవర్గంలో ఇప్పటికీ బీఆర్ఎస్ నాయకుల మాటే చెల్లుబాటు అవుతోందని, ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని నేతలను నిలదీశారు. రామ్మోహన్‌రెడ్డి ఎంత వారించినా వినలేదు. పోలీసులు సైతం నిలువరించే ప్రయత్నం చేశారు. వేదికపై ఉన్న ఎంపీ సురేష్‌షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్ కలుగచేసుకుని సముదాయించడంతో కొంత మేర శాంతించారు.

### స్వేచ్ఛే కాంగ్రెస్‌కు బలం.. బలహీనత : మంత్రి దామోదర రాజనర్సింహ

కాంగ్రెస్ పార్టీకి స్వేచ్ఛే బలం, బలహీనత అని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. కార్యకర్తలు లేనిది పార్టీ లేదు.. నాయకుడు లేడు అన్నారు. పార్టీలో వర్గ విభేదాలు ఉండటం సహజమేనన్నారు. కానీ సమన్వయం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో, తాలుకా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో.. సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలే నాయకులకు బలమని, వారి కృషితోనే నాయకుల గెలుపోటములు ఆధారపడి ఉంటాయన్నారు. కార్యకర్తలకు కచ్చితంగా అండగా ఉంటామన్నారు. వారిని కాపాడుకుంటామని చెప్పారు.

### సేఫ్టీ కోసం గూడెంను తీసుకున్నాం : ఎంపీ సురేష్ షెట్కార్

సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని పడగొడతామంటూ బెదిరింపులకు దిగారని, ప్రభుత్వం సేఫ్టీ కోసమే పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకున్నామని తెలిపారు. ఇది అధిష్టానం నిర్ణయమని, ఎవరూ వ్యతిరేకంగా వెళ్లవద్దని సూచించారు. తన ఎంపీ నియోజకవర్గం బాన్సువాడలోనూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నానని అన్నారు. అక్కడ కూడా బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకున్నారని చెప్పారు. ఇలాంటి నియోజకవర్గాల్లో రెండు వర్గాలకు సమ న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందిరమ్మ కమిటీలతో పాటు, ఇతర సంక్షేమ పథకాల విషయంలోనూ ఇరు వర్గాలకు న్యాయం చేసేలా ముఖ్యనాయకులు చొరవ చూపాలన్నారు.

### గూడెం ఫొటోపై మరో నేత ఫొటో అతికించి..

ఈ సమావేశంలో ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది. సమావేశం వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, జిల్లా ముఖ్యనేతల ఫొటోలను ఏర్పాటు చేశారు. ఇందులో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఫొటో కూడా ఉంది. ఈ ఫొటో ఏర్పాటు చేయడంపై కొందరు నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ ఫ్లెక్సీపై మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫొటోను అతికించారు. సమావేశం జరుగుతున్న హోటల్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలోనూ గూడెం మహిపాల్‌రెడ్డి ఫొటోపై మరోనాయకుడి ఫొటోను అతికించడం చర్చనీయాంశంగా మారింది.



## ఖేడ్ డిపోకు మరో పది బస్సులు

**ఎమ్మెల్యే సంజీవరెడ్డి**



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోకు త్వరలో మరో పది కొత్త బస్సులు రానున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్ నుంచి కంకోల్ వరకు నూతన బస్సు సర్వీసును ఆదివారం మనూరు మండలంలోని బోరంచ నల్లపోచమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మరో పది బస్సులు కావాలని కోరగా కేటాయించేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. కరస్‌గుత్తి నుంచి డోవూర్, మనూర్‌ల మీదుగా సికింద్రాబాద్‌కు , జహీరాబాద్, బీదర్ రూట్లలో, జహీరాబాద్ నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలన్నారు. కంగ్టి, తడ్కల్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శంకర్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మల్లన్న, డీఎం మల్లేశయ్య, పూజారులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మున్నూరు కాపు కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పట్టణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. వారి వారి కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి సహకారం అందించాలని సూచించారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆడపిల్లల పెండ్లికి, మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ నిర్ణయాలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు సపాన దేవ్, శంకర్ యాదవ్, ఆదర్శ్ రెడ్డి, భిక్షపతి, సంఘం నూతన అధ్యక్షుడు భోజయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అకాల వర్షం.. రైతుకు నష్టం



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సైబర్‌కాలనీలో..



వర్షంతోపాటు కురిసిన వడగళ్లు

జిన్నారం(పటాన్‌చెరు)/మునిపల్లి(అందోల్)/రామచంద్రాపురం(పటాన్‌చెరు)/హత్నూర(సంగారెడ్డి): జిల్లాలో కొన్ని చోట్ల ఆదివారం ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. హత్నూర మండలం సిరిపురం గ్రామంలో వరి దెబ్బతిన్నది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయిందని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో జిన్నారం, గడ్డపోతారం, గుమ్మడిదల, పోలక్‌పల్లి, వావిలాల గ్రామాల్లో కూడా పడింది. దీంతో 2 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మునిపల్లి మండలంలో ఇండ్ల మధ్య విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తీగలకు తగలడంతో షాక్ వస్తుందేమోనని ఇండ్ల యజమానులు ఆందోళన చెందారు. రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది.

# ప్రతి రైతుకూ గుర్తింపు కార్డు

- జిల్లాలో నేటి నుంచి 'ఫార్మర్ రిజిస్ట్రీ'
- 40 రోజుల పాటు ఆన్‌లైన్‌లో నమోదు
- 3.26 లక్షల అన్నదాతలకు కార్డులు
- పైలెట్ ప్రాజెక్టు కింద మొగుడంపల్లి గ్రామం ఎంపిక
- ప్రత్యేక యాప్ ద్వారా నమోదు ప్రక్రియ



మొగుడంపల్లి రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ కోసం పేర్లు నమోదు చేయించుకుంటున్న రైతులు

జహీరాబాద్: నేటి నుంచి జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'ఫార్మర్ రిజిస్ట్రీ' నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతుకు 11 అంకెల కార్డును కేటాయించనున్నారు. ఏప్రిల్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద మొగుడంపల్లి రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేసి రైతుల పేర్లను నమోదు చేశారు. మొగుడంపల్లితో పాటు 9 తండాలను చేర్చారు. 4,123 మంది రైతులు ఉండగా, ఇందులో 1,100 మంది రైతుల పేర్లు నమోదు చేశారు. సోమవారం నుంచి నమోదు ప్రక్రియను జూన్ 13వ తేదీ వరకు కొనసాగించనున్నారు. రైతు వేదికల్లో ఏఈఓలు ప్రత్యేక యాప్ ద్వారా రైతుల పేర్లను నమోదు చేస్తారు. రైతు వేదికలు లేని చోట గ్రామ పంచాయతీ భవనాలు, మున్సిపాలిటీల్లోని వార్డు కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి షెడ్యూల్ ప్రకారం ఏఈఓలు వెళ్లి నమోదు చేపడతారు. జిల్లాలో 7.50 లక్షల ఎకరాల నికర సాగు భూమి ఉండగా, 3.26 లక్షల మంది రైతులున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

### ప్రత్యేక యాప్ ద్వారా నమోదు

రైతుల వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు వీలుగా దేశ వ్యాప్తంగా ప్రత్యేక యాప్ ద్వారా ఆధార్ కార్డు మాదిరిగా ఉండాలనే ఉద్దేశంతో సాగుదారుల సంఖ్యను ఇవ్వనున్నారు. పీఎం కిసాన్, క్రాప్ లోన్, పంటల బీమా, యాంత్రీకరణ పరికరాలతో పాటు తదితర పథకాలను సాగుదారుల సంఖ్య ఆధారంగా అందిస్తారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు అందే పథకాలు అమలు చేసేందుకు ఇది ఉపయోగపడనుంది. బ్యాంకు రుణాల కోసం సాగుదారుల సంఖ్య కార్డును తీసుకెళితే సరిపోతుంది. ధాన్యం కొనుగోళ్లకు సైతం ఇదే కార్డును వర్తింపజేయనున్నారు.

### తగిన సమాచారంతో నమోదుకు వెళ్లాలి

సాగుదారుల సంఖ్య కార్డు నమోదుకు తగిన సమాచారంతో వెళ్లాలి. నమోదు కేంద్రానికి ఆధార్‌కార్డు లింకు ఉన్న ఫోన్ నంబర్, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకెళ్లాలి. వ్యవసాయ సిబ్బంది ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారు. అనంతరం రైతు సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని సిబ్బందికి చెబితే 11 అంకెల ప్రత్యేక గుర్తింపుకార్డు సంఖ్యను కేటాయిస్తారు.

### కేంద్రం ఇచ్చే పథకాలకు ఇదే ఆధారం

కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలు ఫార్మర్ రిజిస్ట్రీపైనే ఆధారపడి ఉంటాయి. వ్యవసాయ సంబంధిత పరికరాలను అందజేయడం, పీఎం కిసాన్ తదితర పథకాలకు సాగుదారుల సంఖ్య ఎంతగానో ఉపయోగపడనుంది. ప్రతి పనికి ఈ కార్డు తీసుకెళితే సరిపోతుంది. ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాలకు ఎంపిక చేసిన ప్రాంతాలకు జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు హాజరవుతారు. రైతులకు సలహాలు, సూచనలు అందజేసి పంటల సాగు, దిగుబడులు సాధించడంపై అవగాహన కల్పిస్తారు. ఏఈఓలు ప్రత్యేక యాప్ ద్వారా రైతుల పేర్లు నమోదు చేస్తారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రైతుల నుంచి వివరాలు తీసుకుంటారు. లేని వారి వివరాలు తర్వాత సేకరిస్తాం.

– శివప్రసాద్,వ్యవసాయ శాఖ అధికారి, సంగారెడ్డి జిల్లా

## భగీరథ మహర్షికి నివాళి

సంగారెడ్డి జోన్: భగీరథ మహర్షి దీక్షకు, సహనానికి ప్రతిరూపమని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్‌తో పాటు పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనుకున్నది సాధించేంతవరకు ఎంతటి కష్టమైనా ఎదుర్కోవడంతో ఆయనను భగీరథుడిగా పిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, కలెక్టరేట్ ఏఓ అంతోని, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



భగీరథుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

## క్లుప్తంగా

### పిడుగుపాటుకు ఎడ్లు మృతి


మృత్యువాత పడిన ఎడ్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): పిడుగు పాటుకు రెండు ఎడ్లు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కిష్టాపూర్‌లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చక్రాల బాల్‌రాజు రోజు మాదిరిగా ఎడ్లను వ్యవసాయ పొలం వద్ద కట్టేశాడు. సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో కురిసిన వర్షంతోపాటు ఎడ్ల సమీపంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ. 80 వేల విలువైన జీవాలు మృతి చెందడంతో రైతు బాల్‌రాజు బోరున విలపించాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

### కార్మికుడికి గాయాలు

హత్నూర(సంగారెడ్డి): పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా కెమికల్స్ చేతి పైబడి కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హత్నూర మండలం గుండ్ల మాచునూర్ గ్రామంలో చోటు చేసుకుంది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సమీర్ కొంతకాలంగా గుండ్ల మాచునూర్ గ్రామ శివారులోని కోవాలంట్ లాబోరేటరీ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా శనివారం పరిశ్రమలో విధులకు వెళ్లాడు. ఈ క్రమంలో చేతి పై కెమికల్స్ పడగా గాయాలు అయ్యాయి. కాంట్రాక్టర్ గానీ పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి చికిత్స చేయించలేదని, అవసరమైన వైద్య చికిత్సలు చేయించాలని బాధితుడు కోరుతున్నాడు.

### యువతి అదృశ్యం


ఇందు

సంగారెడ్డి క్రైమ్: యువతి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. నిజామాబాద్ జిల్లా బిచ్కుంద మండలం ఎల్లమ్మ కుచ్చ గ్రామానికి చెందిన ఉబిది శివాజీ, సాయవ్వ దంపతులు రెండేళ్ల కిందట బతుకుదెరువు కోసం పట్టణంలోని ఇందిరా కాలనీకి వచ్చి ఉంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె ఉబిది ఇందు (15) పుట్టుకతో మతి స్థిమితం కోల్పోయింది. 3న సాయంత్రం ఇంటి నుంచి ఆడుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### రెండు కార్లపై కట్టెల లోడ్ లారీ బోల్తా

- పలువురికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే హరీశ్ రావు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్ 65వ జాతీయ రహదారిపై ఆదివారం కట్టెల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కార్లు ధ్వంసం కాగా పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఇదే సమయంలో అటువైపు నుంచి ఎమ్మెల్యే హరీశ్ రావు జహీరాబాద్ పర్యటనకు వెళ్తున్నారు. ఘటనను చూసి తన వాహనాన్ని ఆపారు. పాక్షికంగా ధ్వంసమైన కారులో నుంచి స్థానికులు, సిబ్బంది సాయంతో గాయపడిన వారిని సురక్షితంగా బయటకు తీసి తన వాహనంలోనే చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి ప్రమాద పరిస్థితులను వివరించారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

# దాహం తీర్చే అంబలి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేంద్రాలు ఏర్పాటు
- ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులకు తీరుతున్న దాహం
- స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వరంలో నిర్వహణ
- సేవే పరమావధిగా మరికొందరు ముందుకు..

సేవే పరమావధిగా అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. వేసవిలో బాటసారుల దప్పికను తీర్చాలనే ఉద్దేశంతో స్వచ్ఛంద సంస్థలు, సివిల్ క్లబ్, దాతల ఆధ్వర్యంలో కేంద్రాలని ఏర్పాటు చేశారు. సొంత ఖర్చులతో కొందరు, కుటుంబీకుల జ్ఞాపకార్థం మరికొందరు అంబలి కేంద్రాలు నిర్వహించి వేసవి కాలం పూర్తయ్యే వరకు అంబలి వితరణ చేయనున్నారు.


అంబలి పంపిణీ చేస్తున్న నాగరాజుగౌడ్ కుటుంబీకులు

### సొంత ఖర్చుతో వర్కర్లను పెట్టి నిర్వహణ


అంబలి పోస్తున్న మల్లేశం

దుబ్బాకరూరల్: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన సల్కం మల్లేశం సొంత ఖర్చులతో గ్రామస్తులకు అంబలి కేంద్రం ఏర్పాటు చేసి అందజేస్తున్నారు. గ్రామస్తులకు ఏదో ఒక సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసి ఆరేళ్లుగా నిర్వహిస్తున్నాడు. నిర్వహణకు వేతనం చెల్లించి ప్రత్యేకంగా వర్కర్లను పెట్టాడు. గతంలో కూడా గ్రామస్తులకు వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు.దాదాపుగా రెండు నెలలకు రూ.5 లక్షలు ఖర్చు అవుతుంది.

### తల్లిదండ్రుల జ్ఞాపకార్థం

నర్సాపూర్: తల్లిదండ్రులు దివంగత కమలమ్మ వెంకటస్వామిగౌడ్‌ల జ్ఞాపకార్థం వారానికి ఒక రోజు అంబలి పంపిణీ చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు నర్సాపూర్ మాజీ వార్డు సభ్యుడు నాగరాజుగౌడ్. నర్సాపూర్‌లో ప్రతీ శుక్రవారం నిర్వహించే అంగడికి ఇతర గ్రామాల నుంచి చాలా మంది ప్రజలు వస్తుంటారు. వేసవిలో ఎండ వేడిమికి దాహం తీర్చుకోవడానికి ఇబ్బంది పడుతారు. వారి దాహం తీర్చాలన్న ఆలోచన రావడంతో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బస్టాండ్‌కు ఎదురుగా మెయిన్ రోడ్డుపై అంబలి పంపిణీని సుమారు పదేళ్ల నుంచి చేపడుతున్నాను. ప్రతీ శుక్రవారం సుమారు 2,500 మందికి అంబలి అందచేస్తుంటాం.

### సేవకు మించిన తృప్తి లేదు

**రాజరాజేశ్వరీ రైస్‌మిల్ నిర్వాహకుడు బచ్చు జగదీశ్**

హవేళిఘణాపూర్(మెదక్): ఎండకాలంలో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన ప్రజలకు దాహార్తి తీర్చడానికి మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ రాజరాజేశ్వరీ రైస్‌మిల్ నిర్వాహకులు బచ్చు జగదీశ్ 12 ఏళ్లుగా సేవ చేస్తూ ముందుకెళ్తున్నారు. తన వంతుగా 2012 నుంచి ఇప్పటి వరకు అంబలి కేంద్రంను కొనసాగిస్తున్నారు. రైస్‌మిల్ వద్ద తన తాత పుల్లయ్య జ్ఞాపకార్థం అంబలి కేంద్రం ఏర్పాటు చేసి వారికి నిత్యం కూలీలతో అంబలి తయారు చేయిస్తున్నారు. అంబలి కేంద్రంకు నిత్యం దాదాపు వంద వరకు మంది వచ్చి అంబలి సేవిస్తుంటారు. కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానని నిర్వాహకులు బచ్చు జగదీశ్ అన్నారు. నిత్యం దాదాపు 100మందికి పైగా సరిపోను అంబలి తయారు చేసి ప్రజలకు పంపిణీ చేస్తున్నారు.


ప్రజలకు అంబలి పోస్తున్న నిర్వాహకులు

### ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంబలి


మాతా బోరంచమ్మ ఆలయం వద్ద అంబలి వితరణ

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని మాతా బోరంచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా అంబలి వితరణ గావిస్తున్నారు. ప్రతీ ఏడాది వేసవి కాలంలో ఏప్రిల్, మే రెండు నెలలపాటు ఎండలు అధికంగా ఉంటాయి. పట్టణానికి వివిధ పనులపై వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు అంబలి వితరణ గావిస్తుంటారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో సుమారు 1200 మందికి అంబలి వితరణ చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఈరంటి సత్యనారాయణ తెలిపారు. ప్రతీ మంగళవారం మెదక్‌లోని ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిలో అన్న ప్రసాద వితరణ చేయడం జరుగుతుందని తెలిపారు.

### సోదరుడి జ్ఞాపకార్థం 15 ఏళ్లుగా..



చలివేంద్రం నిర్వహిస్తున్న చీలమల్లన్న

సదాశివపేట(సంగారెడ్డి): మాజీ కౌన్సిలర్లు చీల స్వరూప, చీల మల్లన్న ఆధ్వర్యంలో అన్న చీల బస్వరాజ్ జ్ఞాపకార్థం 15 ఏళ్లుగా పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద చలివేంద్రంతోపాటు అంబలి కేంద్రం ప్రారంభించి ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ప్రతి రోజూ 250 లీటర్ల వరకు అంబలి తయారు చేసి 1,000 మంది వరకు పంపిణీ చేస్తున్నారు. తన అన్న జ్ఞాపకార్థం ఏదో ఒక రూపంలో సేవ చేయాలని ప్రతీ వేసవి ప్రారంభంలో చలివేంద్రం, అంబలి కేంద్రం ప్రారంభించామని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీలమల్లన్న తెలిపారు. ప్రతీ నెలా 30,000 వేల మంది వరకు అంబలి పంపిణీ చేస్తామన్నారు.

## భూ భారతిపై గ్రామ సభలు


గ్రామ సభల ఏర్పాటుపై మండల రెవెన్యూ అధికారులతో ఆర్డీఓ రవీందర్ రెడ్డి

- నేటి నుంచి 19 వరకు నిర్వహణ
- తహసీల్దార్ అధ్యక్షతన రోజుకు రెండు గ్రామాల్లో..
- పైలెట్ ప్రాజెక్టుగా కొండాపూర్

కొండాపూర్(సంగారెడ్డి): రైతులకు సంబంధించి ఎలాంటి భూ సమస్యలైనా తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ భూ భారతి చట్టంపై ఇది వరకే ప్రతీ మండలానికి ఒక దగ్గర జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా 24 రెవెన్యూ గ్రామాలకు గాను 36,611 ఎకరాల భూమి ఉంది. 15 వేల మంది పట్టాదారులున్నారు. మండలంలో ధరణి సమస్యలు నేటికీ 330 వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ గ్రామ సభల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**పైలెట్ ప్రాజెక్టుగా కొండాపూర్**

భూ భారతి చట్టాన్ని అమలు చేయడం కోసం ముందుగా సంగారెడ్డి జిల్లాలో కొండాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా నేటి నుంచి 19వ తేదీ వరకు గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ గ్రామంలో తహసీల్దార్ అధ్యక్షతన రోజుకు రెండు గ్రామాల చొప్పున ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామసభలను నిర్వహించనున్నారు. ఈ గ్రామ సభల ద్వారా ఫిర్యాదులను స్వీకరించేందుకు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఫిర్యాదులను స్వీకరించిన తర్వాత అక్కడికక్కడే సమస్యలను పరిష్కారం చేయనున్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే రైతులు పట్టాదారు పాత పాసుబుక్‌తో పాటు, కొత్త పాసుబుక్, రిజిస్టర్ డాక్యుమెంట్, కోర్టు ఉత్తర్వులు, ఆధార్ కార్డుతో పాటు భూమికి సంబంధించిన ఇతర పత్రాలు ఏవైనా ఉంటే జిరాక్స్ పత్రాలతో రావాలి. ఈ గ్రామ సభలకు జిల్లా, మండల రెవెన్యూ అధికారులు గ్రామాలకు సంబంధించిన సమగ్ర రెవెన్యూ రికార్డులతో హాజరుకానున్నారు.

**ఏ గ్రామంలో ఎప్పుడు..**

గ్రామ సభలు 5వ తేదీన అలియాబాద్, తొగర్‌పల్లి, 6న గారకుర్తి, గిర్మాపూర్, 7న చెర్ల గోపులారం, హరిదాస్‌పూర్, 8న తేర్పోల్, మాచెపల్లి, 9న గడి మల్కాపూర్, గొల్లపల్లి, 12న మునిదేవునిపల్లి, గుంతపల్లిలో నిర్వహించనున్నారు. అలాగే 13న కోనాపూర్, గంగారం, 14న మన్‌సాన్‌పల్లి, మాందాపూర్, 15న సైదాపూర్, మారేపల్లి, 16న కొండాపూర్, అనంతసాగర్, 17న కుతుబ్‌షాహీపేట, మల్లెపల్లి, 19న మల్కాపూర్‌లలో రెవెన్యూ గ్రామ సభలను ఏర్పాటు చేయనున్నారు.

**ఆర్డీఓ పర్యటన :**

భూ భారతి చట్టం అమలులో భాగంగా ఆదివారం గ్రామ సభలు ఏర్పాటు చేయనున్న అలియాబాద్, తొగర్‌పల్లిలో ఆర్డీఓ రవీందర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ అధికారులకు గ్రామసభ ఏర్పాటుపై అవగాహన కల్పించారు.

## భర్త వేధింపులతో నవ వధువు ఆత్మహత్య

- భారీ బందోబస్తు మధ్య పంచనామా
- తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, తహసీల్దార్ మన్నన్ విచారణ

చిన్నశంకరంపేట(మెదక్): భర్త వేధింపులు తాళలేక నవ వధువు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ మన్నన్ ఆదివారం విచారణ నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలం ఆగ్రహారం గ్రామానికి వట్టిపు రాజయ్య కుమారుడు మహేశ్‌తో వెల్దుర్తి మండలం షేరిలాకు చెందిన సాయిలు కూతురు పూజ(20)కి ఫిబ్రవరి 2న వివాహం జరిగింది. పెళ్లైన మూడు నెలల్లోనే భర్త వేధింపులు తట్టుకోలేక పూజ శనివారం ఆత్మహత్యకు పాల్పడగా, మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నాయి. శనివారం రాత్రి నుంచి రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్, చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్‌తో పాటు నార్సింగి, నిజాంపేట, వెల్దుర్తి, మెదక్, చేగుంట పోలీస్‌లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతురాలి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు పూజ భర్త మహేశ్, మామ రాజయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఆదివారం డీఎస్పీ, తహసీల్దార్ మన్నన్ ఆధ్వర్యంలో పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబీకులకు న్యాయం చేస్తామని డీఎస్పీ తెలిపారు.


విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ మన్నన్

## పెళ్లికి తెచ్చిన బంగారం, నగదు చోరీ

**శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో పట్టపగలే దొంగతనం**

శివ్వంపేట: పట్టపగలే ఇంట్లో దొంగలు చొరబడి బంగారంతోపాటు నగదు అపహరించుకుపోయిన ఘటన మండలంలోని పిల్లుట్లలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి, బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాయిని యాదమ్మ కుమారుడు వంశీ వివాహం నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామానికి చెందిన యువతితో 15న జరగాల్సి ఉంది. అప్పుచేసి వివాహం కోసం తెచ్చిన 4 తులాల బంగారం, కొంత నగదు తెచ్చి బీరువాలో దాచి పెట్టారు. వివాహానికి సంబంధించి విషయాలు మాట్లాడుకోవడానికి చిన్నచింతకుంట గ్రామంలో పెళ్లి కూతురు ఇంటికి భోజనానికి ఉదయం వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికొచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువాలు తెరిచి ఉన్నాయి. వాటిలో దాచిన 4 తులాల బంగారం, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి క్లూస్ టీంతో కలిసి పోలీసులు చేరుకొని ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నేరం అంగీకరించినట్లు తెలిసింది. త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.


వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీమ్

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కనకయ్య(ఫైల్)

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. వారం రోజుల కిందట ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లి తిరిగి వస్తుండగా హుస్నాబాద్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వర్గల్ మండలం తున్కిమక్తకు చెందిన చాకలి కనకయ్య(36) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. మృతుడికి భార్య సుజాత, పదేళ్లలోపు శాన్వికా, హన్వికా కుమార్తెలు ఉన్నారు. అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు పాల్గొని మృతుడి కుటుంబీకులను ఓదార్చి రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి

- ఎదురెదురుగా ఢీకొన్న రెండు బైక్‌లు
- మృతులు బీదర్ జిల్లా వాసులు


అమర్ (ఫైల్)


ప్రిన్స్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఎదురెదుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో కర్నాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు వలస కార్మికులు మృతి చెందారు . ఈ ఘటన వర్గల్ మండలం గౌరారం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. కర్నాటక రాష్ట్రం బీదర్ జిల్లా సిర్సి గ్రామానికి చెందిన సిద్ద అమర్(26) కావేరి సీడ్స్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. అదే కంపెనీలో పని చేస్తున్న ప్రిన్స్(20)తో కలిసి రోజు మాదిరిగా ఆదివారం బైక్‌పై కంపెనీ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో మర్కూక్ వైపు నుంచి గౌరారం వైపు వస్తున్న స్పోర్ట్స్ బైక్ వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమర్, ప్రిన్స్‌కి తీవ్ర గాయాలు అయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన స్పోర్ట్స్ బైకిస్టు పోతూరి రజిత్‌వర్మ, వెనుక కూర్చున్న దాసరి దినేశ్ కుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అమర్ మృతి చెందాడు. మెరుగైన వైద్యం కోసం ప్రిన్స్‌ని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుడు అమర్ తండ్రి కంటెప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**బైక్‌ను ఢీకొట్టిన ఆటో : ముగ్గురికి గాయాలు**

హవేళిఘణాపూర్(మెదక్): బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మెదక్ మండలం పాతూర్ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హవేళిఘణాపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన మైలి అశోక్, భార్య లక్ష్మి, మనుమరాలు హారిక కలిసి బైక్‌పై మెదక్‌కు వెళ్తున్నారు. వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని ఆటో ఢీకొట్టడంతో ముగ్గురూ కింద పడగా తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



## పెళ్లి వేడుకకు వచ్చి బాలుడు మృతి

**వరి కోత మిషన్ వెనక్కి తీస్తుండగా ఢీకొట్టడంతో ప్రమాదం**


హర్షిత్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): పెళ్లి వేడుకల కోసం వరి కోత యంత్రం కిందపడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన హర్షిత్(6) తల్లిదండ్రులతో కలిసి చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌కు తన మేనమామ రాజు వివాహానికి వచ్చారు. మూడు రోజుల కిందట వివాహ వేడుకలు పూర్తి కాగా హర్షిత్ ఆడుకుంటున్న క్రమంలో వరి కోత యంత్రం వెనుకకు తీస్తున్న క్రమంలో హర్షిత్‌ను ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు బాలుడి బంధువులు ఆగ్రహించి హర్షిత్ మృతదేహాన్ని వరి కోత యంత్రం యజమాని ఇంటి ఎదుట వేసి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి బంధువులను సముదాయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

**అదుపుతప్పి బైక్‌పై నుంచి పడి**

హవేళిఘణాపూర్(మెదక్): బైక్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లి మలుపు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం సతిమితండాకు చెందిన రమేశ్(40) భార్య స్వరూపతో కలిసి మెదక్ మండలం శివ్వాయిపల్లి తండా బంధువుల వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నారు. శనివారం సాయంత్రం గాజిరెడ్డిపల్లి మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను గమనించి తప్పించబోయి అదుపుతప్పి కిందపడిపోయారు. రమేశ్‌కు తీవ్ర గాయాలు కాగా మెదక్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య స్వరూపకు ఎలాంటి గాయాలు కాలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**రేకులు వేసేందుకు వెళ్లి కిందపడటంతో..**


నాగరాజు(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రేకులు వేసేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన వడియారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వడియారం గ్రామానికి చెందిన గూని నాగరాజు(28) రేకుల షెడ్‌లను నిర్మిస్తుంటాడు. చేగుంటలోని శంకర్‌గౌడ్ ఇంటి దాబాపై రేకులు వేస్తున్నాడు. పాత రేకులను తీస్తున్న క్రమంలో గోడపై నుంచి కిందపడి నాగరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

**విద్యుదాఘాతంతో మహిళ**

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని హుస్సేన్ నగర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడగావ్ సిద్దమ్మ రోజు మాదిరిగానే ఉదయం స్నానం ముగించుకొని బయటికొచ్చి రేకుల షెడ్డు వద్ద గల ఇనుప రాడును పట్టుకుంది. అప్పటికే రాడుకు విద్యుత్ తీగ తగిలి కరెంట్ సరఫరా అవుతుండటంతో సిద్దమ్మ విద్యుదాఘాతానికి గురైంది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సమీపంలో గల బీదర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు.


సిద్దమ్మ మృతదేహం

### లారీ ఢీకొని జీఎంఆర్ కూలీ


అశోక్ (ఫైల్)


భారీగా నిలిచిన వాహనాలు

చేగుంట(తూప్రాన్): లారీ ఢీకొని జీఎంఆర్ సంస్థలో రోడ్డు పనులు చేస్తున్న కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మాసాయిపేట శివారులోని బంగారమ్మ గుడి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన తలారి అశోక్(30) జీఎంఆర్ సంస్థలో జాతీయ రహదారిపై కూలీ పనులు చేస్తుంటాడు. ఆదివారం అశోక్ పని చేసేందుకు వచ్చి మాసాయిపేట శివారులో బంగారమ్మ గుడి వద్ద రోడ్డు పనులు చేస్తుండగా లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోతాన్‌పల్లి గ్రామస్తులు మృతుడి బంధువులు ఘటనా స్థలం వద్ద రాస్తారోకో నిర్వహించారు. జీఎంఆర్ ప్రతినిధులు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. తూప్రాన్, వెల్దుర్తి, చేగుంట పోలీసులు అక్కడికి చేరుకొని నిరసన కారులను శాంతింపజేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.